సాక్షి ఖమ్మం

శనివారం : 22 : ఏప్రిల్ : 2023



'అక్షయ తృతీయ' సందడి

అక్షయ తృతీయ సందర్భంగా శనివారం బంగారు ఆభరణాల కొనుగోళ్లకు జిల్లా వాసులు సిద్ధమవుతున్నారు.

IIలో



దేశాన్ని అమ్మేస్తున్న మోదీ

దేశ సంపదను ప్రధాని మోదీ అమ్మేస్తున్నారని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని, తమ్మినేని ఆరోపించారు.

IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 39° / 25°

కొన్ని ప్రాంతాల్లో శనివారం ఈదురుగాలుల ప్రభావం ఉంటుంది. మిగతా చోట్ల గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ముస్లింలకు మంత్రి, ఎంపీల శుభాకాంక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం శాంతి, ప్రేమ, దయ, సౌభ్రాతృత్వాన్ని బోధిస్తోందని.. మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. అలాగే, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు కూడా శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసే వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి సూచించారు. అండర్–14 ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న పీఈటీలు, పీడీలు, డైరెక్టర్లు, ఎన్‌ఐఎస్, సీనియర్, జాతీయ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వచ్చే నెల 1నుంచి 31వరకు శిక్షణ శిబిరాలు ఉంటాయని, వివరాలకు 98483 55350, 96187 18929 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆయకట్టుకు సాగర్ నీరు నిలిపివేత

కూసుమంచి: జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు పాలేరు రిజర్వాయర్ నుండి నీటి విడుదలను శుక్రవారం అధికారులు నిలిపివేశారు. యాసంగి పంటల షెడ్యూల్ ముగియడంతో నీటి సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో పాటు పాలేరు కాల్వకు కూడా సరఫరా నిలిపేశారు. ఔట్ ఫ్లో లేకపోగా, రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరుతుండగా 23 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరింది. ఇంతలోనే గాలులకు రెండు గేట్లు పడిపోగా అప్రమత్తమైన అధికారులు సరిచేశారు. కాగా, రిజర్వాయర్ శనివారం అలుగుపారే అవకాశం ఉంది.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ

కల్లూరు రూరల్: మండలంలోని పుల్లయ్య బంజరులో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్డీఓ విద్యాచందన శుక్రవారం తనిఖీ చేశారు. కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని రైతులు ఆరోపిస్తుండడంతో వారు పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోళ్లు సక్రమంగా జరగగా రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని, స్థలం లేదని మిల్లర్లు చెబుతూనే దళారుల నుంచి మాత్రం తీసుకుంటున్నారని పలువురు ఆరోపించారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్‌తో పాటు లక్కినేని రఘుతో పాటు మల్లేశ్వరావు, పి.నారాయణరావు, వాసవి నారాయణరావు, పి.రామారావు పాల్గొన్నారు.

'ఉపాధి' సామాజిక తనిఖీలు

మధిర: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మధిర మార్కెట్ లో శుక్రవారం జరిగిన సభకు అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా హాజరయ్యారు. అలాగే, డీఆర్డీఓ విద్యాచందన, ఏపీడీ శిరీష పాల్గొన్నారు. మండలంలోని 27జీపీల్లో పదిహేను రోజులుగా తనిఖీ చేసిన సామాజిక బృందాలు నివేదికలు సమర్పించారు. ఎంపీపీ మొండెం లలిత, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డితో పాటు రమేష్, పవన్‌కుమార్, అభిలాష్ పాల్గొన్నారు.

గాలిదుమారం, చిరుజల్లులు

ఖమ్మం వ్యవసాయం: జిల్లావాసులను శుక్రవారం రోజంతా ఎండ ఉక్కిరిబిక్కిరి చేసింది. కానీ రాత్రి పదిన్నర గంటల తర్వాత ఒకేసారి మార్పు వచ్చింది. జిల్లా కేంద్రంతో పాటు కూసుమంచి తదితర మండలాల్లో ఈదురుగాలులు, ఉరుములు మొదలయ్యాయి. అంతేకాక ఖమ్మంతో పాటు ఇంకొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పటికీ వాతావరణం కాస్త చల్లబడింది.

నిలువ నీడ లేదు..



'ఉపాధి'పై వేసవి దెబ్బ

- పనిప్రదేశాల్లో కనీస ఏర్పాట్లు చేయని యంత్రాంగం
- కానరాని పట్టాలు, ప్రథమచికిత్స కిట్లు
- సౌకర్యాలు లేక.. ఎండ తాళలేక తగ్గుతున్న కూలీల సంఖ్య

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉపాధి హామీ పథకం పనులపై వేసవి ప్రభావం చూపుతోంది. అన్ని మండలాల్లో సగటున 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో కూలీలు సక్రమంగా హాజరుకావడం లేదు. పనికి వచ్చే కూలీల సంఖ్య కూడా క్రమేణా తగ్గుతోంది. ఎండవేడిని తట్టుకునేలా పనిప్రదేశాల్లో కూలీలకు నీడపట్టాలతోపాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచడం లేదు. ఓపక్క కేంద్రప్రభుత్వం పనిదినాలను తగ్గిస్తుండగా.. మరోవైపు అధికార యంత్రాంగం కనీస సౌకర్యాలు కల్పించపోవడంతో కూలీలు ఆసక్తి చూపించడం లేదు. గత ఏడాది ఏప్రిల్ 20న జిల్లాలో ఉపాధి పనులకు 47,449 మంది కూలీలు హాజరుకాగా.. ఈ ఏడాది ఇదే రోజు 20,239 మంది మాత్రమే హాజరైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఉపాధి కల్పించడమే లక్ష్యంగా..

వ్యవసాయ పనుల అనంతరం వేసవిలో ఎలాంటి పనులు ఉండకపోవడంతో కూలీలను ఆదుకునేందుకు 2006లో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా కూలీలు ఏడాది పొడవునా ఉపాధి పొందుతుండగా, వేసవిలో వీరికి కల్పతరువులా ఉంటుంది. వ్యవసాయ పనులు ముగిశాక మార్చి నుంచి జూన్ వరకు రోజుకు 70 వేల నుంచి 90 వేల మంది కూలీలు పనిచేసేవారు. కానీ రెండేళ్లుగా జిల్లాలో కూలీల సంఖ్య క్రమేణా తగ్గుతోంది.

సౌకర్యాల లేమి..

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టే ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలను అధికారులు కల్పించాల్సి ఉంటుంది. అయితే మూడేళ్లుగా అధికారులు దృష్టి సారించడం లేదు. పనిప్రదేశాల్లో నీడపట్టాలు ఏర్పాటుచేసిన ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీటి వసతి కల్పించాల్సి ఉన్నా ఎక్కడా లేవు. ఇక కూలీలు ఇంటి నుంచి నీళ్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

2019లో చివరిసారిగా..

ఉపాధి కూలీలు ఎండలో పనిచేసే సమయాన సేద తీరేందుకు ప్రభుత్వం 2016లో జిల్లాకు 16,650 పట్టాలు మంజూరు చేసింది. అదే ఏడాది ఇందులో 13,650 పట్టాలను పంపిణీ చేసిన అధికారులు, మిగిలినవి 2019లో అందజేశారు. అవి ఇప్పుడు పనికి రాకుండా పోగా.. కొత్తవి సమకూర్చకపోవడంతో కూలీలు సేద తీరేందుకు చెట్లనీడను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇక పనిప్రదేశాల్లో ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేసేందుకు 2017లో 18వేల ప్రథమ చికిత్స కిట్లు సమకూర్చిన ప్రభుత్వం.. ఆ తర్వాత దృష్టి సారించలేదు.

వివరాలు..

జిల్లాలో జాబ్‌కార్డులు	3,04,000
కూలీలు	6,45,000
యాక్టివ్ జాబ్‌కార్డులు	1,85,000
పనికి వెళ్లే కూలీల సంఖ్య	3,12,000
ఇప్పటి వరకు పనులు	
ప్రారంభం కాని జీపీలు	02

అసౌకర్యాల నడుమ..

ఇక్కడ కనిపిస్తున్న కూలీలు ఉపాధి హామీ పథకంలో భాగంగా కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని జగన్నాథుల చెరువులో పనిచేస్తున్నారు. దాదాపు 150 మంది పూడికతీత పనులకు వస్తుండగా.. మండిపోయే ఎండలోనూ నీడ పట్టాలు ఇవ్వలేదు. జీపీల ద్వారా అందించాలని మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆదేశించగా.. అందరికీ టెంట్లు ఏర్పాటు చేయలేమని పాలకులు చేతులెత్తేశారు. తాగునీటి వసతి కూడా లేక కూలీలే తెచ్చుకుంటున్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సైతం అందుబాటులో లేకపోగా, వడదెబ్బ తగిలితే తక్షణ సపర్యలు చేసేందుకు హెల్త్ కిట్లు ఇవ్వలేదు.

ని'బంధనాలు'

ఉపాధి హామీ పథకం నిర్వహణ సాఫ్ట్‌వేర్‌ను కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుని కొన్ని మార్పులు చేసింది. లేబర్ బడ్జెట్‌ను తగ్గించడమే కాక కూలీల హాజరును రెండుసార్లు నమోదు చేయాలని సూచించింది. అయితే వేసవిలో ఉదయం 6 గంటలకు వచ్చే కూలీలు 12 గంటల వరకు పని చేస్తారు. కానీ ఈ ఏడాది పది గంటలు దాటితే పని చేసే పరిస్థితులు లేవు. అయితే, రెండు సార్లు హాజరు నిబంధనతో పనిచేయలేక... కూలి పొందలేక వారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అటు నిబంధనలు, ఇటు ఎండ వేడి.. మరోపక్క సౌకర్యాలు లేక పనులపై కూలీలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో జిల్లాలో హాజరు తక్కువగానే నమోదవుతోంది.

ఎండకు అల్లాడుతున్నాం..



మండుటెండలో పని చేయాల్సి వస్తోంది. ఎండ బాగా పెరిగిపోవడంతో ఇబ్బందిగా ఉంది. ఒక రోజు పనికిపోతే ఇంకోరోజు వెళ్లలేకపోతున్నాం. అధికారులు ఇకనైనా మా కోసం నీడ పట్టాలు ఏర్పాటు చేయాలి. అలాగే, తాగునీరు. మందులు అందుబాటులో ఉంచాలి.

– గుగులోత్ కిషన్, రామనర్సయ్యనగర్, కొణిజర్ల

ఈద్ ముబారక్ హో!



సత్తుపల్లి ఈద్గాలో నమాజ్‌కు పూర్తయిన ఏర్పాట్లు

నేడు రంజాన్ పర్వదినం

- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలకు పూర్తయిన ఏర్పాట్లు


సత్తుపల్లి: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగను శనివారం జరుపుకోనున్నారు. ఈదుల్ ఫితర్‌గా పిలిచే పండుగ సందర్భంగా ఈద్ ముబారక్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు, మసీదుల్లో ప్రార్థనలు ఆచరించిన ముస్లింలు పండుగకు సిద్ధమయ్యారు. ఈమేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఫిత్రా దానం ఇవ్వాల్సిందే..

ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న ప్రతిఒక్కరు ఫిత్రా (దానం) తప్పక చెల్లించి ఈదుల్ ఫితర్ నమాజ్ చదవాల్సి ఉంటుంది. పండుగరోజు పుట్టిన బిడ్డ పేరిట కూడా ఫిత్రా దానం ఇవ్వాలని మతపెద్దలు చెబుతారు. బహిరంగ మార్కెట్‌లో రెండున్నర కిలోల గోధుమల ధర ఎంత ఉంటోందో అంత మొత్తంలో ఫిత్రా చెల్లించనున్నారు. ప్రస్తుతం ఒక్కొక్కరు రూ.80 చొప్పున చెల్లించాలని ముస్లిం మత పెద్దలు నిర్ణయించారు. అయితే అంతకంటే ఎక్కువ కూడా ఇవ్వొచ్చు. తద్వారా నిరుపేదలు కూడా సంతోషంగా పండుగ జరుపుకునేందుకు అవకాశం ఉంటుంది.

ముప్పై రోజుల కఠిన ఉపవాస దీక్ష

షవ్వాల్ చాంద్(నెల వంక) శుక్రవారం రాత్రి కనిపించగానే శనివారం పండుగ జరుపుకోవాలని మత పెద్దలు ప్రకటించారు. దీంతో పండుగ ఏర్పాట్లలో ముస్లింలు నిమగ్నమయ్యారు. సేమియా, సెంట్, దుస్తులు ఇతరత్రా కొనుగోళ్లకు వచ్చిన వారితో రహదారులు కిక్కిరిసిపోయాయి. ముప్పై రోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు రంజాన్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకుంటారు. తెల్లవారుజామున 'ఫజర్' నమాజ్ ఆచరించి ఈదుల్ ఫితర్ నమాజ్ చదవాల్సి ఉంటుంది. నమాజ్‌కు వెళ్లే ముందు పవిత్రంగా(గుసూల్) తలస్నానం చేసి కొత్త దుస్తులు ధరించి, అత్తరు పూసుకోవడం ఆనవాయితీ. అలాగే, సేమియా లేదంటే ఏదైనా తీపి పదార్థం తిని వజూ చేసుకొని నమాజ్ కోసం ఈద్గాలకు వెళ్తారు.



విద్యుత్ లైట్ల వెలుతురులో ఖమ్మం శుక్రవారపేటలోని మజీద్

ధాన్యం కొనుగోలుకు 230 కేంద్రాలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

- 4.03 లక్షల మెట్రిక్ టన్నులు సేకరిస్తాం..
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- రేజర్లలో కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

తల్లాడ: జిల్లాలో యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లకు గాను 230కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఆయా కేంద్రాల ద్వారా 4.03లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనేది లక్ష్యమని తెలిపారు. తల్లాడ మండలం రేజర్లలో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కేంద్రాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దనే సీఎం కేసీఆర్ ధాన్యం కొనుగోళ్లకు నిర్ణయించారని తెలిపారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోకపోగా.. తెలంగాణ ఏర్పాటయ్యాక కేసీఆర్ మాత్రం అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని వివరించారు. ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకుని మద్దతు ధర పొందాలని రైతులను ఆయన కోరారు. డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మన్లు రాయల శేషగిరిరావు, కూరాకుల నాగభూషణం, అదనపు కలెక్టర్ మధుసూదన్, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ గంటా శ్రీలత, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డితో పాటు ఏపీఎం శ్రీనివాసరావు, రామచంద్రరావు, కేతినేని చలపతిరావు, ము వ్వా మురళి, తూము వీరభద్రరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.263కోట్లు

రఘునాథపాలెం: జిల్లాలో ఎక్కడా లేనట్లుగా రఘునాథపాలెం మండలంలో అభివృద్ధి పనులకు రూ.263కోట్లు వెచ్చించినట్లు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చింతగుర్తిలో వివిధ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన పీహెచ్‌సీ, రహదారులు, కల్వర్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు రూ.263 కోట్లు వెచ్చించడమే కాక, రూ.200కోట్ల విలువైన పథకాలు అమలుచేశామని తెలిపారు. ఇంతటి ప్రగతి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నా రు. రూ.20లక్షలతో నిర్మించిన పీహెచ్‌సీ, రూ.20లక్షలతో నిర్మించిన రఘునాథపాలెం నుండి వీ.వీ.పాలెం రహదారిలో డ్రెయినేజీ, స్లాబ్ కల్వర్టును మంత్రి ప్రారంభించారు. సర్పంచ్ మెంటెం రామారావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, జెడ్పీటీసీ ప్రియాంక, తహసీల్దార్ నర్సింహారావుతో పాటు గుత్తా రవి, మాదంశెట్టి హరిప్రసాద్, ప్రదీప్, లక్ష్మణ్‌నాయక్, జహీర్ అలీ, మద్దినేని వెంకటరమణ, పిన్ని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు

అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటైన కేంద్రాల్లో ఇబ్బంది ఎదురుకాకుండా చూడాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశమై సూచనలు చేశారు. ఆతర్వాత మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఎవరు కూడా రక్తహీనతతో బాధపడకుండా చూడాలని సూచించారు. అంగన్‌వాడీల్లో లబ్ధిదారులు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు వివరించాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు ఏ.మధుసూదన్, స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఎస్‌ఓ రాజేందర్, జిల్లా మేనేజర్ సోములు, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్టీఓ కిషన్‌రావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజు, జిల్లా సంక్షేమ అధికారి సీహెచ్.సంధ్యారాణి, డీఈఓ సోమశేఖరశర్మ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాంబాబు, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సంపత్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరరావు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

తల్లాడ/కల్లూరు రూరల్: పాఠశాలలకు సెలవులు వస్తున్న నేపథ్యాన మన ఊరు – మన బడి పథకం పనులు వేగంగా చేపట్టి పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. తల్లాడ, కల్లూరు మండలాల్లోని పలు పాఠశాలల్లో పనులను ఆయన తనిఖీ చేసి సూచనలు చేశారు. అలాగే, కల్లూరు మినీ స్టేడియం పనులు, హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీఓ సూర్యనారాయణ, పీఆర్ ఈఈ చంద్రమౌళి, టీఎస్ఈడబ్ల్యూసీ డీఈ వైకుంఠాచారి, ఎంపీడీఓలు రవీంద్రరెడ్డి, రవికుమార్, తహసీల్దార్లు గంటా శ్రీలత, బాబ్జీప్రసాద్, ఎంఈఓ దామోదరప్రసాద్‌తో పాటు రాంబాబు, వెంకటేశ్వరావు, డాక్టర్ ఎల్.రఘు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఉగ్రం' విజయం సాధించాలి



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంగాంధీచౌక్: సారపాకకు చెందిన విజయ్ దర్శకత్వంలో, అల్లరి నరేష్ హీరోగా రూపొందించిన 'ఉగ్రం' సినిమా విజయం సాధించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ఖమ్మంలో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో చిత్ర ట్రైలర్‌ను మంత్రి విడుదల చేసి మాట్లాడారు. ఆతర్వాత హీరో అల్లరి నరేష్ మాట్లాడగా చిత్ర బృందం అబ్బూరి రవి, తూము వెంకట్, పాకాలశ్రీచరణ్, సాహూ, హరీష్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

చింతకాని: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్క రూ వినియోగించుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ సూచించారు. మండలంలోని నేరడలో కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించాక మండల కేంద్రంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఎంపీపీ కె.పూర్ణయ్య, జెడ్పీటీసీ తిరుపతి కిషోర్, తహసీల్దార్ మంగీలాల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రవీంద్రప్రసాద్, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో మనోవేదన

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన పురుగుల మందు తాగిన వృద్ధ దంపతులు చికిత్స పొందుతూ గంటల వ్యవధిలోనే మృతి చెందారు. ఈ ఘటన మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. మడుపల్లికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు పుచ్చకాయల చిన్న నరసింహయ్య(85), గౌరమ్మ(75) దంపతులకు కుమారుడు ఉన్నాడు. అయితే, కుటుంబంలో కలహాల కారణంగా ఆవేదనకు లోనైన వారు శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగారు. ఈ విషయాన్ని గమనించిన కుమారుడు వారిద్దరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌరమ్మ రాత్రి 9గంటలకు మృతి చెందగా, కొద్ది గంటల తర్వాత భర్త చిన్న నరసింహయ్య కూడా మృతి చెందాడు.

రంజాన్ కళ

ముస్లింలు శనివారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం మత పెద్దలు ప్రకటించారు. దీంతో పండుగ సామగ్రి, దుస్తులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో ఖమ్మం జిల్లా కేంద్రంలోని కమాన్‌బజార్, మహిళా పోలీస్ స్టేషన్ రోడ్లు కిక్కిరిసిపోయాయి. సేమియా ప్యాకెట్లు, సెంట్ బాటిళ్లు, దుస్తులు తదితర కొనుగోలు పెద్దసంఖ్యలో ముస్లింలు రాగా రద్దీ నెలకొంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సెంట్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్న వ్యక్తి



దుస్తులు కొనుగోలు చేస్తున్న ముస్లింలు



బూట్లు, పాదరక్షలను పరిశీలిస్తున్న దృశ్యం



కొనుగోలుదారులతో కిక్కిరిసిన ఖమ్మం కమాన్ బజార్

అక్షయ తృతీయ సందడి

నేడు 'పసిడి' పండుగ

- ఆఫర్లు ప్రకటించిన జ్యూయలరీ షాపులు
- గతంతో పోలిస్తే పెరిగిన బంగారం ధర



నగరంలోని ఓ షోరూంలో ఆభరణాలను పరిశీలిస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుందని నమ్మే అక్షయ తృతీయ వచ్చేసింది. బంగారాన్ని లక్ష్మి, సరస్వతి, గౌరీరూపాలుగా వారు అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు శనివారం పండుగ జరుపుకోనుండగా... పసిడి ప్రియుల ఆకాంక్షలకు అనుగుణంగా నగల దుకాణాలు, షోరూంల నిర్వాహకులు ఆఫర్లు ప్రకటించి, కొత్త డిజైన్లలో బంగారు ఆభరణాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అక్షయ తృతీయ రోజున ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతమవుతుందని నమ్మిక.

కొత్త డిజైన్లతో షోరూంలు కళకళ

అక్షయ తృతీయ సందర్భంగా జ్యూయెలరీ దుకాణాలు, కార్పొరేట్ షోరూంల నిర్వాహకులు భిన్నమైన డిజైన్లలో ఆభరణాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కొంతకాలంగా అక్షయ తృతీయ క్రేజీ పెరగడతో పండుగ రోజు రద్దీ ఉంటుందని కొందరు ముందుగానే కొనుగోలు చేస్తుండగా.. మరికొందరు నచ్చిన ఆభరణాలకు డబ్బు చెల్లించి బుక్ చేసుకున్నారు.

పెరిగిన పసిడి ధరలు

బంగారం ధరలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. ఖమ్మం మార్కెట్‌లో ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 61,150 కాగా గత ఏడాది అక్షయ తృతీయ ముందు రోజు రూ.53 వేలు పలికింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ. 56,050లు కాగా గత ఏడాది రూ.48 వేలు ఉంది. ఇటీవల కాలంతో పాటు బంగారం ధరలు పెరుగుతున్నాయి.

ఆఫర్స్ అదుర్స్

పసిడి ప్రియులను ఆకట్టుకునేందుకు షోరూంల నిర్వాహకులు ఆఫర్లను ప్రకటించారు. ఆభరణాల తయారీ ఖర్చును కొందరు తగ్గించగా.. మరికొందరు పూర్తిగా మినహాయిస్తామని వెల్లడించారు. ఇంకా మరికొందరు ఇతర ఆఫర్లు ప్రకటించడంతో జిల్లా వాసులు కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

బంగారం కొనుగోళ్లకు ఆసక్తి

ధర ఎలా ఉన్నా సెంటిమెంట్ ఉన్న వారు నగల కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారు. అక్షయ తృతీయ సందర్భంగా ధర ఎంత ఉన్నప్పటికీ కొద్దిమొత్తంలోనైనా బంగారు కొనుగోలు చేసేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. మరికొందరు ఆభరణాలు కాకుండా గోల్డ్ కాయిన్స్ కొనుగోలు చేయనుండడంతో షోరూంల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

దేశాన్ని అమ్మేస్తున్న మోదీ

- బీజేపీని గద్దె దించడమే కమ్యూనిస్టుల లక్ష్యం
- కష్టజీవులకు కష్టం కలిగిస్తే కేసీఆర్‌నైనా నిలదీస్తాం.
- ప్రజాపోరుయాత్ర ముగింపు సభలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని, తమ్మినేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన వీరభద్రం, నాయకులు

ఖమ్మంరూరల్: దేశ సంపదను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గంపగుత్తగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతోందని.. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని మోదీని గద్దె దించడమే ఉభయ కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరుయాత్ర శుక్రవారం రాత్రి వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ బ్యాంకులు, ఎల్‌ఐసీ, బొగ్గు గనులు, రైళ్లు, విమానాశ్రయాలను మోదీ తూకం పెట్టి అమ్ముతున్నారని విమర్శించారు. దీనికి తోడు దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రకు బీజేపీ పాల్పడుతోందని తెలిపారు. నిన్నమొన్నటి వరకు పదవుల కోసం అర్రులు చాచిన వారు ఇప్పుడు కమ్యూనిస్టులను విమర్శిస్తున్నారని.. కానీ వందేళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టులు మానవ సమాజం ఉన్నంత వరకు కొనసాగుతారని చెప్పారు. ఏ పార్టీలో చేరాలో నిర్ణయించుకోలేని నేతలకు ప్రజలే గుణపాఠం చెబుతారని కూనంనేని హెచ్చరించారు.

బీజేపీని నిలువరించడమే లక్ష్యం

దేశాన్ని అన్నిరంగాల్లో లూటీ చేస్తున్న బీజేపీని నిలువరించి వచ్చే ఎన్నికల్లో ఓడించడమే ఉభయ కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. సీపీఐ ప్రజాపోరు యాత్రకు సంఘీభావం తెలిపిన తమ్మినేని మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఎక్కడ ఉన్నారనే వారికి ఈ సభే సమాధానం చెబుతుందన్నారు. క్రిస్టియన్లు, ముస్లింలు లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుందో బీజేపీ చెప్పాలన్నారు. బీజేపీలో సామాజిక న్యాయం లేకపోగా, కేవలం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే వారి అజెండా అని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన అన్ని వ్యవస్థలను కేంద్రప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు బీజేపీ తత్వం ఆరేళ్ల తర్వాత బోధపడడంతో ఆయన ఆ పార్టీని ఓడించేందుకు లౌకిక శక్తులను ఏకం చేస్తున్నారని తెలిపారు. అయితే, కష్టజీవులకు తెలంగాణ ప్రభుత్వం కష్టం కలిగిస్తే కేసీఆర్‌నైనా నిలదీస్తామని తమ్మినేని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తో పొత్తు కుదిరితే కమ్యూనిస్టులకు బలం ఉన్న చోట సీట్లు అడుగుతామని, ఈ ప్రభావం ఖమ్మం జిల్లాలో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇంకా ఈ సభలో సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావుతో పాటు నాయకులు దండి సురేష్, ఎండీ.మౌలానా, జె.జితేందర్‌రెడ్డి, మిడకంటి చినవెంకటరెడ్డి, ఏఫూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, చెరుకుపల్లి భాస్కర్, పుచ్చకాయల సుధాకర్ తదితరులే కాక పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: ప్రజాపోరు యాత్ర శుక్రవారం ఉదయం తిరుమలాయపాలెం మండలంలో కొనసాగగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హేమంతరావు మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు కొమ్ము శ్రీను, ఎం.డీ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో టిప్పర్ పైనుంచి పడిన కార్మికుడు

వెనక టైర్ ఎక్కడంతో మృతి



ఉరాన్ రాజు (ఫైల్)

తిరుమలాయపాలెం: కంకరలోడుతో వెళ్తున్న టిప్పర్ క్యాబిన్‌లో కూర్చున్న క్లీనర్ నిద్రమత్తులో పడిపోగా.. ఆయన పైనుంచి అదే టిప్పర్ వెనక టైరు వెళ్లడంతో మృతి చెందిన ఘటన ఇది. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం క్రషర్ మిల్లులో బీహార్‌కు చెందిన ఉరాన్ రాజు(32) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడకు టిప్పర్‌లో డ్రైవర్‌తో కలిసి కంకర తీసుకెళ్తుండగా మండలంలోని మాదిరిపురం రెడ్డి హోటల్ వద్ద నిద్రమత్తులో ఉన్న రాజు కింద పడ్డాడు. ఇంతలోనే అదే టిప్పర్ వెనుక టైర్ ఆయనపై నుంచి వెళ్లడంతో తలభాగం నుజ్జునుజ్జయి మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వస్థలానికి తరలించే స్థోమత లేకపోవడంతో సహచరులు అన్నం ఫౌండేషన్‌ను ఆశ్రయించగా చైర్మన్ శ్రీనివాసరావు చేరుకుని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక బీహార్ తరలిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి

తల్లాడ: మండలంలోని అంజనాపురం సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. సత్తుపల్లి మండలం కిష్టాపురానికి చెందిన దండప్రోలు శ్రీదర్‌రావు(37) కారులో ఖమ్మం వైపు బయలుదేరాడు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టగా శ్రీధర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కిష్టాపురం ఓసీ రైల్వే ట్రాక్ వద్ద శ్రీధర్‌రావు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ప్రాణం తీసిన ఆట!

- విద్యుదాఘాతంతో బాలుడు మృతి
- సెలవులకు అమ్మమ్మ ఇంటికి రాగా ఘటన



కౌశిక్ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో అమ్మమ్మ ఇంటి వద్ద గడుపు దామని వచ్చిన ఓ బాలుడు ఆడుకునే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఏపీలోని ఏలూ రు జిల్లా సూరేపల్లికి చెందిన కొల్లి సాయి, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తుండగా వీరి చిన్నకుమారుడు కౌశిక్(10) 4వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం కౌశిక్(10), తన అన్నతో కలిసి సత్తుపల్లిలో ఉండే అమ్మమ్మ - తాతయ్య చల్లగుళ్ల హన్మంతరావు ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో శుక్రవారం కౌశిక్ స్నేహితులతో కలిసి దొంగా, పోలీస్.. ఆడుతూ అపార్ట్‌మెంట్‌లోని పెంట్‌హౌస్‌పైన దాక్కునేందుకు వెళ్లాడు. అక్కడ ఏసీ ఔట్‌డోర్ పక్కన కూర్చోగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కాసేపయ్యాక అపస్మారక స్థితిలో పడిపోయిన ఆయనను స్నేహితులు, కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోగా బాలుడు మృతి చెందాడు. అనంతరం కౌశిక్ మృతదేహాన్ని స్వగ్రామమైన సూరేపల్లికి తరలించారు.

రాష్ట్ర రాజకీయాల్లో ఖమ్మంకు ప్రత్యేకత



ఇల్లెందు క్రాస్‌రోడ్డులో పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర రాజకీయాల్లో ఖమ్మంకు ప్రత్యేకత ఉందని.. ఈ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలుస్తోందని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి అన్నారు. ఈనెల 24న ఖమ్మంలో జరగనున్న నిరుద్యోగ నిరసన ర్యాలీ సన్నాహక సమాశాన్ని నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహమ్మద్ జావేద్‌తో కలిసి సంభాని, నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరితో నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీతో రేయింబవళ్లు కష్టపడి చదువుకున్న వారు నష్టపోయారని చెప్పారు. ఈమేరకు నిరుద్యోగులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన ఈనెల 24న జరిగే నిరుద్యోగ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ర్యాలీ జరగనున్న ప్రదేశాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే, నగరంలోని సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి ర్యాలీకి హాజరుకావాలని నిరుద్యోగులను కోరారు. ఈకార్యక్రమాల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి, ఎడ్లపల్లి సంతోష్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ తాటి వెంకటేశ్వర్లు, నాయకులు రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం ,దొబ్బల సౌజన్య, బొందయ్య, మిక్కిలినేని నరేందర్, మొక్కా శేఖర్ గౌడ్, పగడాల మంజుల, రామసహాయం మాధవీరెడ్డి, యర్రం బాలగంగాధర్ తిలక్, మద్ది శ్రీనివాసరెడ్డి, నున్నా నాగేశ్వరరావు, వెంకటరత్నం, రామూర్తినాయక్, కట్ల రంగారావు, బెల్లంకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ న్యాయమూర్తులకు సన్మానం



జిల్లా జడ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ బాధ్యులు



న్యాయమూర్తి డానీరూత్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు, న్యాయమూర్తి ఆర్.డానీరూత్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సమావేశంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొని వారిని సన్మానించడమే కాక సేవలను కొనియాడారు. అనంతరం జడ్జిలు శ్రీనివాసరావు, డానీరూత్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఇక్కడ విధినిర్వహణలో న్యాయవాదుల సహకారాన్ని మరువలేనిదన్నారు. న్యాయమూర్తులు మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా, శాంతిసోని, మౌనిక, పూజిత, న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, మాదిరాజు లక్ష్మీనారాయణ, మన్నేపల్లి బసవయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, పాస్టర్స్ ఫెలోషిప్ బాధ్యులు కూడా న్యాయమూర్తులు శ్రీనివాసరావు, డానీరూత్‌ను సన్మానించారు. ఖమ్మం పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల సత్యంతో పాటు సామ్యేలు, దానియేలు, కె.మోసోపు, మోజెస్, ఎం.రాజు, పి.జెకరయ్య, జోసెఫ్ రామారావు, జార్జి ముల్లర్, రాధాకృష్ణ, అనిల్ కుమార్, తిమోతీరావు, ఎరీషా పాల్గొన్నారు.

వాహనం పైనుండి జారిపడి బాలిక మృతి

దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం



వేదప్రియ (ఫైల్)

వైరారూరల్: రహదారిపై గుంతలను తప్పించే క్రమంలో బ్రేక్ వేయగా ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోవడంతో బాలికకు తీవ్రగాయాలై మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. ఏన్కూరు మండలం తూతక్కలింగన్నపేటకు చెందిన రాజబోయిన సురేష్, సీతామహాలక్ష్మి దంపతులు తమ కుమారుడు జ్ఞానీకేశ్వర్, వేదప్రియ(8)తో కలిసి ద్విచక్రవాహనంపై ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నెమలి గ్రామంలోని దైవదర్శనానికి బయల్దేరారు. మార్గమధ్యలోని కేజీ సిరిపురం శివారులో రహదారిపై గతుకులను తప్పించే క్రమంలో సురేష్‌బ్రేక్ వేయగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన పడింది. ఈ ఘటనలో సురేష్, ఆయన భార్య, కుమారుడికి స్వల్ప గాయాలు కాగా వేదప్రియకు తల, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరిని వైరాకు తరలించి వైద్యుల సూచనలతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేస్తుండగానే వేదప్రియ మృతి చెందింది. దైవదర్శనం కోసం వెళ్తుండగా తమ కుమార్తె మృతి చెందడడాన్ని జీర్ణించుకోలేక కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

చికిత్స పొందుతున్న రైతు...



రామలక్ష్మణుడు (ఫైల్)

కొణిజర్ల: కౌలుకు భూమి తీసుకుని అప్పులు చేసి మరీ పంటలు సాగు చేయగా దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ జె.శంకరరావు కథనం ప్రకారం... మండలంలోని పెద్దగోపతికి చెందిన ఇజ్జగాని రామలక్ష్మణుడు(40) పలువురి భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తుండగా రెండేళ్లుగా దిగుబడి రాలేదు. ఈసారి మొక్కజొన్న సాగుచేయడంతో అకాల వర్షంతో నష్టం వచ్చింది. దీంతో ఈనెల 15న ఆయన పురుగుల మందు తాగగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య రమణ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గల్లంతైన విద్యార్థి కోసం గాలింపు

ట్రాక్టర్ల ద్వారా నీరు తోడుతున్నా తగ్గని ప్రవాహం

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో క్వారీ గుంతలో ఈతకు వెళ్లి గల్లంతైన ముదిగొండ మండలం గోకినేపల్లికి చెందిన విద్యార్థి షేక్ లాలు(13) కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆయన స్నేహితులతో కలిసి గురువారం ఈతకు వెళ్లి గల్లంతు కాగా, ఘటన పై కలెక్టర్ గౌతమ్ ఆరా తీశారు. దీంతో శుక్రవారం ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, సీఐ జితేందర్‌రెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. క్వారీ కుంత దాదాపు 40 అడుగుల లోతు ఉండటంతో ఇరవైకి పైగా మోటార్లతో నీరు ఎత్తిపోస్తున్నారు. అయినప్పటికీ నీటి ప్రవాహం తగ్గకపోవడంతో గజ ఈతగాళ్లు కూడా లోతులోకి వెళ్లలేక బయటకు వచ్చారు. ఈతగాళ్లకు తోడు నేలకొండపల్లి ఎంపీఓ సి.హెచ్.శివ కూడా గుంతలో దిగి గాలింపు చర్యల్లో పాలుపంచుకున్నారు. మరోపక్క 24గంటలు గడిచినా తమ కుమారుడి ఆచూకీ తెలియరాక లాలు తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సాధారణంగా అందరూ కాఫీ లేదా గరం గరం చాయ్‌తో రోజును ప్రారంభిస్తారు. అందులో కొత్తేమీ లేదు. బండిలో పెట్రోలు పోయకపోతే బండి ముందుకు కదలనని మొరాయించినట్లే ఇది కూడా! అయితే ఇది వేసవి కాబట్టి అలా కాఫీ, టీ లకు బదులుగా పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఒక గ్లాసు ఆరోగ్యకరమైన పానీయం తాగటం చాలా మంచిదని అంటున్నారు నిపుణులు. కావాలంటే ఓ అరగంట గ్యాప్ ఇచ్చి, యథావిధిగా కాఫీనో, టీనో తాగచ్చు. అలా తాగడం ద్వారా ఉదయం పూట రిఫ్రెషింగ్ గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. అలాంటి గుడ్ మార్నింగ్ డ్రింక్స్ కొన్నింటిని చూద్దాం.



మార్నింగ్ డ్రింక్‌తో రోజంతా హుషారుగా



తేనె- దాల్చిన చెక్క పానీయం

ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని వేసి తాగాలి. ఇది మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కడుపును శుభ్రం చేస్తుంది.



నిమ్మరసం

ఒక గ్లాసు నిమ్మరసం సహజంగా శరీరంలో టాక్సిన్స్ ఏమీ లేకుండా చేస్తుంది. ఇది ఉదయం వేళ టీ లేదా కాఫీకి కూడా మంచి ప్రత్యామ్నాయం. గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగాలి, రుచి కోసం కొంచెం తేనెను కూడా కలపవచ్చు.



దాల్చిన చెక్క గ్రీన్ టీ

గ్రీన్ టీ తాగితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, కడుపు సమస్యలను నివారించడానికి, మీరు శుభోదయ పానీయంగా కప్పు గ్రీన్ టీ తాగవచ్చు. గ్రీన్ టీ రుచి ఇష్టం లేకపోతే అందులో ఒక చిటికెడు దాల్చిన చెక్క పొడి, తేనె కలిపితే సరి. ఆ పానీయాన్ని ఆస్వాదించవచ్చు.



కొబ్బరి నీరు

కొబ్బరి నీరు చాలా ఆరోగ్యకరమైన పానీయం. అప్పుడప్పుడూ ఉదయం పూట కొబ్బరి నీరు తాగుతుంటే మీకు మార్నింగ్ ఎనర్జీ డ్రింక్‌గా మాత్రమే కాదు, మీ శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేసే రుచికరమైన పానీయం. సాదా కొబ్బరి నీరు తాగండి, ఇందులో ఏమీ కలపాల్సిన అవసరం లేదు.



అలోవెరా జ్యూస్


చాలారకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులు కలబంద ఆధారితమైనవే ఉంటాయి. ఉదయం పూట కలబంద జ్యూస్ తాగటం ఎంతో ఉత్తమం. ఈ పానీయం ఉదయాన్నే తాగిన తరువాత, మీ శరీరం తక్షణమే చైతన్యం అవుతుంది. మీరు మీ రోజును ప్రారంభించడానికి తగిన తక్షణ శక్తి వస్తుంది. అంతేకాదు, చర్మసమస్యలు అన్నీ పోయి, మెరిసే చర్మం వస్తుంది.

దోసకాయ... పుదీనా జ్యూస్

దోసకాయ పుదీనా నీరు జ్యూస్ డిటాక్సింగ్ డ్రింక్. మీ శరీరం నుంచి మలినాలను, విషపదార్థాలను తొలగిస్తుంది. ఉదయం పూట మిమ్మల్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. మీ ఆరోగ్యకరమైన ఉదయం దినచర్యకు ఇది మంచి డ్రింక్. ముఖ్యంగా వేసవిలో పుదీనాతో కలిసిన దోసకాయ డ్రింక్ మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.

రోజ్ షర్బత్

ముందుగా సబ్జా గింజలను నీటిలో నానబెట్టండి, ఈ లోపు రోజ్ సిరప్ సిద్ధం చేసుకోండి. ఒక గుప్పెడు తాజా గులాబీ పువ్వు రెమ్మలను తీసుకొని ఒక గిన్నె నీటిలో ఉడికించండి. మరొక గిన్నెలో చక్కెర, నీరు కలిపి చక్కెర పాకం తయారు చేయండి. చక్కెర పాకంలో ఉడికించిన గులాబీ నీరు ఫిల్టర్ చేసుకొని బాగా కలిపేస్తే రోజ్ సిరప్ రెడీ. ఇప్పుడు మెత్తగా నానబెట్టిన సబ్జా గింజలను వడకట్టి ఒక గ్లాసులోకి తీసుకోండి.అందులో రోజ్ సిరప్, ఐస్ క్యూబ్స్, కోల్డ్ వాటర్ వేసి కలపండి, పై నుంచి నిమ్మరసం పిండుకోండి. అంతే, రోజ్ షర్బత్ రెడీ.



వేసవి అంతా రోజూ ఉదయం పూట ఇలాంటి ఏదైనా ఒక పానీయం తాగటం ద్వారా మీరు రోజంతా చురుకుగా, హుషారుగా ఉంటారు.

మీకు తెలుసా?

మొలకెత్తిన బంగాళదుంపలు తింటే మన ఆరోగ్యానికే పెను ముప్పు తెచ్చిపెడతాయి. బంగాళదుంపలపై వచ్చే మొలకలు విషపూరితమైనవని చెబుతున్నారు నిపుణులు. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్‌కి దారి తీసి ప్రాణాల మీదకు కూడా తెస్తుంది. బంగాళదుంపలపై ఏర్పడే మొలకల్లో గ్లైకో అల్కాయిడ్స్ అనే విషపూరితమైన రసాయన పదార్థాలు ఉంటాయి. మొలకెత్తిన బంగాళదుంపల్లో అధిక స్థాయిలో ఈ రసాయన పదార్థం ఉంటుంది. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవి తిన్న కొద్ది గంటలలోనే వాంతులు, విరోచనాలు, పొత్తి కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా లో బీపీ, పల్స్ ఎక్కువగా కొట్టుకోవడం, జ్వరం, తలనొప్పి, మతిమరుపు.. కడుపులో నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన ఆలుగడ్డలను గర్భిణీలు తింటే పుట్టబోయే బిడ్డపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. బంగాళదుంపలను చల్లని, చీకటి ప్రదేశాల్లో నిల్వ ఉంచడం ద్వారా అవి మొలకెత్తడాన్ని నివారించవచ్చు.



ఎండలో కంటికి అండగా...



వేసవి కాలంలో చర్మానికి సంబంధించిన సమస్యలే కాదు, కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తాయి. ఎండవేడిమికి గురికావడం వల్ల కళ్లు పొడిబారడం లేదా మంటలు పుట్టడం, ఎర్రబారడం వంటి సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడంతోపాటు కొన్ని రకాల ఆహార పానీయాలు తీసుకోవడం మంచిది. అవేమిటో చూద్దాం.

కంటి ఆరోగ్యాన్ని కాపాడే వాటిలో నిమ్మరసం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎండలనుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా, కళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనిని కూడా చేస్తుంది. ఎందుకంటే, నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షిస్తుంది. అంతే కాదు, నిమ్మకాయలో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలో ఉండే లుటిన్, జియాక్సంతిన్ అనే ముఖ్యమైన పోషకాలు మాక్యులర్ డీ జనరేషన్, కంటిశుక్లం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి కళ్ల రక్తనాళాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది రెటీనాకు రక్త ప్రసరణ జరిగేలా చూస్తుంది. తద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఇంకా పుచ్చకాయ, కర్బూజ, మామిడి, బొప్పాయి పండ్లు తినడం, కొబ్బరినీళ్లు తాగడం, ఆహారంలో ఉల్లిపాయలను బాగా ఉపయోగించడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కళ్లు మంటలు ఉన్నప్పుడు కాసిని మల్లెపూలను ఒక గ్లాసు నీళ్లలో వేసి అరగంట తర్వాత ఆ నీటితో కళ్లను కడుక్కుంటే ఉపశమనం కలుగుతుంది. అలాగే, చక్రాలుగా తరిగిన కీరాముక్కలను లేదా బంగాళదుంప ముక్కలను కళ్ల మీద ఉంచుకోవడం కూడా ప్రయోజనకరం. కొంతమందికి రాత్రిపూట కళ్లు కనిపించవు. ఈ వ్యాధిని రేచీకటి అంటారు. ఆహారంలో విటమిన్ ఎ ఆధారిత ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించాలంటే పాలకూర, బొప్పాయి, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో తోటకూర, పొన్నగంటి కూర కంటికి చాలా మంచిది.

ఈ కాలంలో వీచే వడగాలులు చాలా ప్రమాదకరం. వేడిమికి కళ్లల్లో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఫలితంగా కంటి వద్ద చర్మం పొడిబారి, కళ్లల్లో ఇసుక వేసినట్లుగా ఉంటుంది. గాలులకు దుమ్ము, ధూళి కంట్లో పడడం వల్ల కళ్ల దురద, మంటలు వస్తాయి. అందువల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ గ్లాసులు పెట్టుకోవాలి. ఇంటికి చేరిన వెంటనే చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.

హెల్త్ టిప్స్

అల్లం అంగుళం ముక్క, బెల్లం చిన్న ముక్క తీసుకుని రెండూ కలిపి రాత్రి పడుకోబోయేముందు నమిలి తింటే మల బద్ధకం పోతుంది.



మెంతికూర చిన్నదిగాని, పెద్దదిగాని కూర చేసుకుని రోజూ కనీసం మూడు నెలలు తింటే రక్తహీనత తగ్గుతుంది.





వేపనూనె, కర్పూరం కలిపి రాస్తే తలలోని కురుపులు మాడిపోతాయి, చుండ్రు తగ్గుతుంది.

మొదటి విమాన ప్రయాణమా?



మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు చాలా ఆసక్తిగా ఉంటుంది. విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో అలర్ట్‌గా ఉండాలి. ఏమీ తినకుండా లేదా ఫుల్లుగా తిని విమాన ప్రయాణం చేయకూడదు. ముఖ్యంగా కొన్ని ఆహారపదార్థాలకి దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...

విమానంలో ప్రయాణించే ముందు బిర్యానీ, ఊరగాయలు వంటి ఆయిల్, స్పైసీ ఫుడ్ తింటే కడుపు నొప్పి వస్తుంది. గుండె మంట, మూత్రాశయం చికాకు సమస్యలు వస్తాయి. ఇవిఅధిక కేలరీలను కలిగి ఉండటంతోబాటు వీటి మూలాన నోటి నుంచి వాసన వస్తుంది. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌లో కంటికి ఇంపుగా నోరూరిస్తూ కనిపించే రకరకాల ప్యాకేజ్డ్ ఫుడ్ తీసుకోవడం అసలు మంచిది కాదు. ప్రయాణించే ముందు బర్గర్ లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల అరుగుదల సరిగా లేక గుండెల్లో మంట వస్తుంది. అలాగే ఆపిల్ తినడమూ అంత మంచిది కాదు. ఎసిడిటీ లేదా గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. యాపిల్స్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల అది పేగు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే బొప్పాయి లేదా నారింజ పండ్లను తినవచ్చు. చాలామంది ఫ్లైట్ ఎక్కే ముందు ఏదో ఒక రకమైన స్నాక్స్ తింటారు. అయితే ఆరోగ్యనిపుణుల అభిప్రాయం ప్రకారం స్నాక్స్ అజీర్ణం, వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. అలాగే విమాన ప్రయాణానికి ముందు బ్రోకలీతో చేసిన ఆహారాలు కూడా తినకూడదని గుర్తుంచుకోండి.


సినిమా

ఆటకు వేళాయె


ఆటకు వేళాయె అంటూ కొందరు స్టార్స్ ప్లేయర్స్‌గా మారారు. క్రికెటర్లుగా, కోచ్‌లుగా మౌల్డ్ అయిపోయారు. అయితే ఈ ఆట అంతా సినిమాల కోసమే. ప్రస్తుతం క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. కొన్ని కాల్పనిక కథలు కాగా, కొన్ని బయోపిక్స్ కూడా ఉన్నాయి. ఇక వెండితెరపై క్రికెటర్లుగా అలరించనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.


● రజనీకాంత్

● సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ క్రికెట్ మ్యాచ్ నిర్వహణ మీద ఉన్నారు. 'లాల్ సలామ్' చిత్రం కోసమే ఇదంతా. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో, రజనీకాంత్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ క్రికెట్ కోచ్ పాత్రలో కనిపిస్తారనీ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధిగా కనిపిస్తారనీ ప్రచారం జరుగుతోంది. మరి.. రజనీ ఏ పాత్రలో కనిపిస్తారో చూడాలి. 'లాల్ సలామ్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.


● సిద్ధార్థ్


● నయనతార


● మాధవన్

● క్రికెట్ గ్రౌండ్‌లో బిజీగా ఉంటున్నారు మాధవన్, సిద్ధార్థ్, నయనతార. ఈ ముగ్గురూ కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఆడనున్న మ్యాచ్ 'ది టెస్ట్'. తమిళ నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో నయనతార, మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

● శ్రీలంక మాజీ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ '800' టైటిల్‌తో తెరకెక్కుతోంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో సలీమ్ మాలిక్ పాత్ర చేసిన మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో మురళీధరన్ పాత్ర చేస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. ''మురళీధరన్ జీవితంలోని పలు కోణాలను ఈ చిత్రంతో వెండితెరపై ఆవిష్కరించనున్నాం. 800 వికెట్లు తీసిన ఏకైక ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మురళీధరన్ పేరిట రికార్డు ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● మధుర్ మిట్టల్

● భారత ప్రముఖ మాజీ క్రికెటర్ జులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందిన వెబ్ మూవీ 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ గోస్వామిగా అనుష్కా శర్మ నటించారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పశ్చిమ బెంగాల్ చక్దా ప్రాంతానికి చెందిన జులన్ గోస్వామి దాదాపు రెండు దశాబ్దాలు మహిళా క్రికెటర్‌గా, కెప్టెన్‌గా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను లీడ్ చేశారు. ఉమెన్స్ వన్ డే ఇంటర్‌నేషనల్ క్రికెట్ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జులన్ రికార్డు సాధించారు.



● అనుష్కా శర్మ

● యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ సైతం క్రికెట్ బ్యాట్ పట్టారు. 'మిస్టర్ అండ్ మిస్ట్రస్ మహి' సినిమాలో జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటిస్తున్నారు. రాజ్‌కుమార్ రావ్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. రియల్ క్రికెటర్స్ దగ్గర శిక్షణ తీసుకుని జాన్వీ కపూర్ ఈ సినిమా చేశారు. వీరితోపాటు మరికొందరు క్రికెటర్ల బయోపిక్‌లు, క్రికెట్ ఆధారంగా సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.


● జాన్వీ కపూర్

టైమ్‌లెస్ లవ్!

హీరో నాగచైతన్య–డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు–తమిళ చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా మే 12న రిలీజ్ కానుంది. ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్‌శంకర్ రాజా స్వరపరచిన ఈ చిత్రంలోని 'టైమ్‌లెస్ లవ్..' అంటూ సాగే పాటని రేపు (ఆదివారం) రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో 'కస్టడీ' తెరకెక్కుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, కెమెరా: ఎస్ఆర్ కదిర్.


● నాగచైతన్య, కృతీ శెట్టి

వీళ్లందరూ మిస్ అవలేదు..


● 'అల్లరి' నరేశ్


'నిన్న రాత్రి నుంచి మా నాన్న కనిపించడం లేదు సార్', 'రెండు వారాల నుంచి మా అబ్బాయి కనిపించడం లేదు సార్' అనే డైలాగులతో 'ఉగ్రం' సినిమా ట్రైలర్ విడుదలైంది. 'నాంది' వంటి హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఉగ్రం'. మిర్నా మీనన్ కథానాయికగా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదల చేశారు. 'వీళ్లందరూ మిస్ అవలేదు.. మిస్ చేయబడ్డారు. అందులో నా భార్య, కూతురు కూడా ఉన్నారు ('అల్లరి' నరేశ్), 'చీకట్లో జరిగే వ్యాపారం.. చీకట్లోనే వదిలెయ్. (విలన్ పాత్రధారి)' వంటి డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉగ్రం'. నరేశ్ పాత్రను విజయ్ కనకమేడల ఇంటెన్స్‌గా చూపించారు. 'నాంది'లా 'ఉగ్రం' కూడా మంచి హిట్ అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

వినోదాత్మకంగా...

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్లమాన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్పాల దర్శకత్వంలో డా. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నేత అద్దంకి దయాకర్ కీలక పాత్రలు పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. బత్తిని కీర్తిలత మాట్లాడుతూ– ''ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ మధ్య ప్రివ్యూ షో చూసిన సినీ, రాజకీయ ప్రముఖులు బాగుందని అభినందించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్రంలోని 'ఎల్లమ్మ..' పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. మంచి కథను కామెడీగా చెప్పడంతో ప్రేక్షకులకు మా సినిమా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


● సుధాకర్ రెడ్డి

వాస్తవ ఘటన ఆధారంగా....


● రాజీవ్ కనకాల

అనిరుధ్, యశస్విని జంటగా, రాజీవ్ కనకాల, జీవా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. భిక్షపతి రాజు మాట్లాడుతూ– ''వాస్తవ ఘటన స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని పాత్రలన్నీ సహజంగా ఉంటాయి. సీనియర్ నటులు జీవా, రాజీవ్ కనకాల నటన హైలైట్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు.

డాక్టర్ రేణు


● రుహానీ శర్మ

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో డాక్టర్ రేణు పాత్రలో హీరోయిన్ రుహానీ శర్మ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. 'చిలసౌ, హిట్: ది ఫస్ట్ కేస్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు రుహానీ శర్మ. 'శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'హిట్: ది ఫస్ట్ కేస్'లో హీరోయిన్‌గా నటించారు రుహానీ. ఇప్పుడు మరోసారి ఆయన దర్శకత్వంలో 'సైంధవ్'లో డాక్టర్ రేణుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీని ఈ చిత్రంతో తెలుగుకి పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం 'సైంధవ్' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్.

చూపు తిప్పిందేంటి?

'తెలుగు ఇండస్ట్రీ కన్నడపై చూపు తిప్పిందేంటి?' అనే డైలాగ్‌తో 'మళ్ళీ పెళ్లి' సినిమా టీజర్ విడుదలైంది. వీకే నరేష్, పవిత్రా లోకేష్ జోడీగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేష్ నిర్మిస్తున్నారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మధువే' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'అతను భార్యని ఎలా చూసుకోవాలో, భార్య విలువేంటి? అని తెలియని ఒక మృగం' (వనితా విజయ్ కుమార్), 'చుట్టూ అప్పులు, ఒంటినిండా రోగాలు పెట్టుకున్న నీతో సరసం ఏంటి?' (వీకే నరేశ్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''ఆసక్తికరమైన కథలను ఎంచుకుంటున్న ఎంఎస్ రాజు మరో విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ వేసవిలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. జయసుధ, శరత్ బాబు, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.


● పవిత్ర, నరేశ్